21 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సనత్‌నగర్: బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి తృతీయవార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అమరం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 21న పుణ్యాహవాచనం, రక్షాబంధన్, అంకురార్పణ, 22న ఉదయం సుప్రభాతసేవ, అగ్ని ప్రతిష్ఠ, గరుడపట ధ్వజారోహణం, దేవతా ఆహ్వానం, సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, హోమం, ఎదుర్కోళ్లు, 23న ఉదయం సుప్రభాతసేవ, విశేష సేవ, శ్రీవారి కల్యాణ మహోత్సవం, సాయంత్రం విశేష పూజలు, పల్లకిసేవ, 24న ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, చక్రస్నానం, సాయంత్రం 5.30 గంటలకు ధ్వజారోహణం, పుష్పయాగం, మంత్ర పుష్పం తదితర పూజలు ఉంటాయన్నారు.

కేంద్ర మంత్రుల స్వాగతానికి భారీ ఏర్పాట్లు

బన్సీలాల్‌పేట్: కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా రాష్ట్రానికి విచ్చేస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు ఘన స్వాగతం పలుకడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న నగరానికి వస్తున్న కేంద్ర మంత్రులకు భారీ ఎత్తున స్వాగతం పలుకనున్నట్లు ఆయన తెలిపారు. 20న సాయంత్రం బేగంపేట్ విమానాశ్రయం నుంచి బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. ఈ ర్యాలీ బేగంపేట్ విమానాశ్రయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం, ప్యారడైజ్, రాణిగంజ్, మారియెట్ హోటల్, ముషీరాబాద్ చౌరస్తా, గోల్కొండ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, నారాయణగూడ ఫ్లై ఓవర్, హిమాయత్‌నగర్, లిబర్టీ, బషీర్‌బాగ్, అబిడ్స్ మీదుగా బీజేపీ కార్యాలయానికి చేరుకుంటుదన్నారు.

నేడు మాణికేశ్వర్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ పర్యటన

లాలాపేట: జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్ రెడ్డి బుధవారం తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.వర్షాకాలం వచ్చే ఇబ్బందులను ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశాలపై ఆయా విభాగాల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సలహాలు, సూచనలు చేస్తారు.

'నీట్' లీక్‌పై ఓయూలో నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ అక్రమాల పై ఓయూలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సామూహికంగా నిరసన తెలిపారు. మంగళవారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట పీడీఎస్‌యూ ఏఐడీఎస్ఓ, యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష లీక్‌ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. నీట్ అక్రమాలకు పాల్పడిన అధికారులను కఠినంగా శిక్షించి పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు.

డొనేషన్లను అరికట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ కాలేజీల్లో డొనేషన్లను అరికట్టాలని నవ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ (ఎన్‌టీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షులు బైరు నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. నోటిఫికేషన్ రాక ముందే బీ-కేటగిరి సీట్లను రూ. లక్షల్లో విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రైవేటు కాలేజీల్లో ఇంజినీరింగ్ సీట్లను రూ.10 నుంచి రూ.30 లక్షల వరకు డొనేషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి బీ-కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 9వ నెంబర్ ప్లాట్‌ఫాం సమీపంలోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించగా కొన్ని గంటలు చికిత్స పొంది మృతి చెందాడు. మృతుడికి 45 ఏళ్లు ఉంటాయని ఒంటిపై తెల్లని షర్టు, గోధుమరంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా విద్యార్థి మృతి



రాహుల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు



రాహుల్ (ఫైల్)

చిలకలగూడ: అనుమానాస్పద స్థితిలో భవనంపై నుంచి పడి విద్యార్థి మృతి చెందిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన నాయకుడు రాపోలు సురేష్ కుమారుడు రాహుల్ (17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి 10 సమయంలో నలుగురు మిత్రులతో కలిసి తన ఇంటి భవనం ఐదో అంతస్తు టెర్రాస్‌పైకి వెళ్లి మద్యం తాగారు. మెట్లపై కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి మొదటి అంతస్తులో పడిపోయాడు. భయాందోళనకు గురైన స్నేహితులు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా అక్కడి నుంచి పరారయ్యారు. కొంత సమయం తర్వాత తండ్రి సురేష్ వచ్చి చూడగా రాహుల్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు స్నేహితులను అదుపులోకి తీసుకున్నారు. మెట్లపై కాలుజారి ప్రమాదవశాత్తు పడిపోయాడా.. స్నేహితుల మధ్య ఏమైన గొడవ జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, రామేశ్వరగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

విద్యుత్ స్తంభాలపై నిప్పుల అలజడి!

- ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- చినుకులు కురిస్తే గంటల తరబడి అంతరాయం
- ఫిర్యాదు చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సనత్‌నగర్‌లోని ఓ స్తంభంపై మంటలు

సనత్‌నగర్: చినుకుపడితే చాలు.. కరెంట్ కష్టాలు మొదలవుతున్నాయి. తరచూ విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు వస్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తోందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు ఫిర్యాదు చేద్దామంటే ఎవరూ స్పందించరు. విద్యుత్ కార్యాలయానికి సమాచారం ఇద్దామంటే ల్యాండ్‌లైన్‌లో ఉండదు. ఫలితంగా విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం..తిరిగి ఎప్పుడు పునరుద్ధరిస్తారో అర్థం కాని పరిస్థితి. సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కురిసిన వర్షం రాత్రికి కాలనీల్లో అంధకారంలో మగ్గేలా చేసింది. ముఖ్యంగా సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో జనం నానా ఇక్కట్లు పడుతున్నారు. ఒకవైపు విద్యుత్ శాఖకు చెందిన వైర్లు భయపెట్టిస్తుంటే.. ఇంకో వైపు ప్రైవేటు సంస్థలకు చెందిన కేబుల్స్ కుప్పలుగా పేరుకుపోయి ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో వర్షం పడినప్పుడు ఏ వైర్ల నుంచి మంటలు, నిప్పు రవ్వలు వస్తున్నాయో తెలియని దుస్థితి నెలకొంది.

గంటల తరబడి మంటలు..

సోమవారం సనత్‌నగర్ కూరగాయల మార్కెట్ వద్ద ఓ స్తంభం వద్ద ఏకధాటిగా వచ్చిన మంటలు జనాన్ని ఉరుకులు పరుగులు పెట్టించాయి. గంటల తరబడి మంట మండుతుండటంతో సమీపవాసులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే బేగంపేట బ్రాహ్మణవాడీ మార్గంలో ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడిపోయి నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. ఈ క్రమంలో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో బ్రాహ్మణవాడీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. అలాగే సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్ సమీపంలోని కమాన్ వద్ద కూడా కరెంటు వైర్ల నుంచి నిప్పు రవ్వలు రావడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇలా పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొనడంతో ఏం జరుగుతుందోనని కంగారు పడుతున్నారు.

కారణం ఇదే..



సనత్‌నగర్‌లో కరెంటు స్తంభాలకు తీగలు ఇలా..

ఆయా ప్రాంతాల్లో కరెంటు స్తంభాలకు కుప్పలు కుప్పలుగా వైర్లు ప్రమాదకర స్థాయిలో వేలాడుతున్నాయి. తరచూ చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తూనే ఉన్నారు. కానీ పూర్తిస్థాయిలో చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో ఇప్పుడు గాలి వీచినప్పుడు చెట్ల కొమ్మలు కరెంటు తీగలపై పడుతున్నాయి. వీటిపైనే ఎక్కువ శాతం ఫిర్యాదులు వస్తున్నట్లు తెలుస్తోంది. వేసవిలో ప్రతిరోజూ ఏదో సమయంలో చెట్ల కొమ్మలు తొలగింపు ప్రక్రియను చేపడుతూ వచ్చినా ఇంకా చాలాచోట్ల చెట్ల కొమ్మలు కరెంటు వైర్ల వరకు ఎదిగి ఈదురుగాలుల సమయంలో ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అలాగే కుప్పలు కుప్పలుగా కరెంటు స్తంభాలకు వేలాడుతున్న వైర్ల నిర్వహణపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఒక్కోసారి వీటి నుంచి కూడా మంటలు వ్యాపించి ప్రధాన లైన్లపై ప్రభావాన్ని చూపించే ప్రమాదం లేకపోలేదని పలువురు వాపోతున్నారు.

కానరాని విద్యుత్ సిబ్బంది..

సనత్‌నగర్‌లో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేద్దామంటే అటు ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు ఎవరూ స్పందించడం లేదని, కార్యాలయ ల్యాండ్‌లైన్ ఫోన్ వాయిస్ కూడా సరిగా వినిపించడం లేదని శివాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి వాపోయాడు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే బీఎస్ఎన్ఎల్ అధికారులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చి చేస్తారని విద్యుత్ అధికారుల నుంచి సమాధానం వచ్చిందని పేర్కొన్నాడు. పరిస్థితి ఇలా ఉంటే అత్యవసర సమయంలో ఫిర్యాదు చేయాలంటే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రమాదకరంగా ఉన్న వైర్లతో పాటు కరెంటు వైర్లపై వాలే చెట్ల కొమ్మలను తొలగించే ప్రక్రియపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

లష్కర్ జిల్లా ఏర్పాటుకు కృషిచేస్తా



ఎంపీ లక్ష్మణ్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా సాధనసమితి సభ్యులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం కోసం తనవంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ హామీ ఇచ్చారు. మంగళవారం డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసిన లష్కర్ సాధన సమితి ప్రతినిధులు ప్రత్యేక జిల్లా ఏర్పాటు కోసం వినతి పత్రం అందించారు. ఇందుకు స్పందించిన ఎంపీ లక్ష్మణ్ పెరిగిన జనాభా ప్రాతిపదికన సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమ పార్టీలో చర్చించి సికింద్రాబాద్ జిల్లా విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. వినతి ఇచ్చిన వారిలో పీఎల్ శ్రీనివాస్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బాలరాజ్‌యాదవ్, బాబురావు, సునీల్‌ముదిరాజ్, జగ్గయ్య, జగదీశ్‌గౌడ్, కృష్ణముదిరాజ్, రవీందర్‌సాగర్ ఉన్నారు.

టోక్యోలో భారతీయ సంగీత విభావరి



కార్యక్రమంలో పాల్గొన్న భారతీయులు, సంగీత కళాకారులు

బన్సీలాల్‌పేట్: గాన గంధర్వుడు.. పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఈ నెల 16న జపాన్ టోక్యోలో సంగీ త విభావరి కార్యక్రమాన్ని నూతి మాధవ ఆధ్వర్యంలో భారతీయులు ఎక్కువగా నివసించే ని షి కసాయి ప్రాంతంలో ఘనంగా నిర్వహించా రు. సుమారు 20 మంది గాయనీ, గాయకులు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాడిన పాటలను వినిపించి ఆయనకు ఘన నివాళులర్పించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.55, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 85, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 65, పందిరి బీర 72, క్యాబేజీ 23, క్యా రెట్ 23, దొండ 40, గుండుబీన్స్ 155, గింజ చి క్కుడు 55, గోకరకాయ 55, కీర 33, దోసకాయ 2 3, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చా మగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 17, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

బస్సు ప్రమాదంలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మరణించిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం సాయంత్రం 8 గంటల సమయంలో మిధాని డిపోకు చెందిన ఓ బస్సు రెతిఫైల్ బస్టాండ్ ఔట్ గేటు సమీపంలో ట్రాఫిక్ బూత్ వద్ద ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డా డు. గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని మృతుడికి 45-50 సంవత్సరాలు ఉంటుంది. సంబంధీకులు ఎవరైనా ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ట్రాఫిక్ చక్రబంధంలో ఆర్పీరోడ్డు

- కానరాని ట్రాఫిక్ పోలీసులు, ఆక్రమణలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు
- గంటల తరబడి స్తంభిస్తున్న వాహనాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వ్యాపార కార్యకలాపాలు, జన సంచారంతో సందడిగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలతో వాహనచోదకులు నరకం చవి చూస్తున్నారు. ఏళ్ల తరబడి నుంచి అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు..పెరుగుతున్న వాహనాల సంఖ్య కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యతో పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అధికారుల పర్యవేక్షణలోపం..సిబ్బంది అలసత్వం ట్రాఫిక్‌కు గుదిబండగా మారుతోంది. ఓ వైపు వాహనాల రద్దీ మరో వైపు వ్యాపారస్తుల ఫుట్‌పాత్ ఆక్రమణలతో ఈ ప్రాంతం ఇరుకుగా మారింది. కర్బలామైదాన్ చౌరస్తా నుంచి బైబిల్ హౌస్, కింగ్స్‌వే, సిటీలైట్ చౌరస్తా, బాటా, ప్యాట్నీ వరకు నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కిలో మీటర్ల పొడవునా రోడ్లపై వాహనాలు స్తంభించిపోతాయి.

రోడ్డుపై లోడింగ్ అన్‌లోడింగ్..

ఆర్పీ రోడ్డు, ఓల్డ్ బోయిగూడ, గాస్ మండి ప్రాంతాల్లోని స్థానిక వ్యాపారులు రోడ్లపైనే తమ ట్రాలీలు, ఇతరత్రా వాహనాలు పార్కు చేస్తున్నారు. అదే విధంగా స్థానిక వ్యాపారస్తులు సైతం తమ కార్లను రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. పలువురు వ్యాపారస్తులు తమ వస్తువులు, సామగ్రిని తమ దుకాణాల ముందు ఆటోట్రాలీలను పెట్టి లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాల కోసం వచ్చే పలువురు తమ కార్లను రోడ్డుపై పార్కు చేసి వెళ్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హైదర్‌బస్తీ, ఆర్పీ రోడ్డు, ఓల్డ్‌బోయిగూడ, కింగ్స్‌వే తదితర ప్రాంతాల్లోని రోడ్లపై లోడింగ్ అన్‌లోడింగ్ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు సదరు వ్యాపారస్తుల నుంచి మామూళ్లు తీసుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం...

ఆర్పీ రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆ స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు ఆ విభాగం అధికారులు ఓ నిర్దిష్టమైన కార్యాచరణ లేపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. స్థానిక ట్రాఫిక్ పోలీసులు చలాన్లు, డ్రంకెన్ డ్రైవ్ విషయంతో కనబరుస్తున్న శ్రద్ధ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో చూపడం లేదనేది వాస్తవం. నిత్యం రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్ సమస్యలను నియంత్రించాల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిబ్బంది సంఖ్యను పెంచినట్లయితే కొంత వరకు సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు వాపోతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రభుత్వం ద్విచక్ర వాహనాలతో క్రేన్‌లను కూడా సమకూర్చింది. వీటి సహకారంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాల్సిన సిబ్బంది ఆ స్థాయిలో పని చేయకపోవడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు చేపడుతున్నాం..

సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయిన ప్రాంతాల్లో తమ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని క్రమబద్ధీకరిస్తున్నారు. ట్రాఫిక్‌పై వాహనచోదకులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ విధుల విషయంలో తమ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేస్తున్నాం.

–ఉప శంకర్, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టే పనుల్లో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆదేశించారు. ఐదోవార్డు త్రిమూర్తి కాలనీలో పెండింగ్‌లో ఉన్న కల్వర్టు పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టే పనుల విషయంలో స్థానికుల అభిప్రాయాలు, అభ్యంతరాలను సైతం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. నాలుగో వార్డు పికెట్ సుబ్బారావు కాలనీలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి మధుకర్, డీబీ దేవెందర్, బద్రీనాథ్ యాదవ్, శ్రవణ్ యాదవ్, తేజ్‌పాల్, వెంకటేశ్, సదానంద్ గౌడ్, వెంకటేశ్వర్లు, సంజీవ్, సత్యనారాయణ, వినోద్ పాల్గొన్నారు.

వార్డుకొక మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్..

కంటోన్మెంట్‌లోనూ జీహెచ్ఎంసీలో తరహా వార్డుకొక మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. అందుకు తగిన స్థలాలను గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మారేడుపల్లి, తిరుమలగిరి, సికింద్రాబాద్ మండలాల తహసీల్దార్లు అధికారులు పద్మ సుందరి, అశోక్, పాండు నాయక్‌తో పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలు అందజేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనుందన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని వైద్యారోగ్య శాఖ అధికారులు రాజకుమారి, విశాల్ రావు, డాక్టర్ సాయి శ్వేత, డాక్టర్ సుష్మ, డాక్టర్ నాగార్జున తదితరులతో సమీక్ష నిర్వహించి బస్తీ దవాఖానాల స్థితిగతులు, కల్పించాల్సిన వసతులపై అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే బస్తీ దవాఖానాలకు సొంత భవనాలు ఏర్పాటు చేస్తామన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసిన రెవెన్యూ అధికారులు

- బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, సీఐ రామయ్య, కార్ఖానా ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌లు ఎమ్మెల్యేను కలిశారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.

హైటెన్షన్ వైర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



తార్నాకలో ఇళ్ల పైనుంచి ఉన్న హైటెన్షన్ వైర్లు

లాలాపేట: తార్నాక స్ట్రీట్ నెంబర్-11 ప్రాంతంలో సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న హైటెన్షన్ వైర్ల సమస్యను మంగళవారం టీపీసీసీ కార్యదర్శి అమర్‌నాథ్‌గౌడ్ మంగళవారం విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు హైటెన్షన్ వైర్ల సమస్యను పట్టించుకోపోవడంతో సమస్య అలాగే ఉండిపోయిందన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుని ఇప్పటికే దాదాపు 5 మంది ప్రాణాలు కోల్పోయారని ఈ సమస్యను ప్రభుత్వం, విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. వారివెంట బ్రహ్మజీ, రమేష్, శ్రీనివాస్, దుర్గయ్య, పద్మారావు, జగన్, అనురాధ, అర్చన, సుమిత్ర ఉన్నారు.

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు బకాయిలు చెల్లించండి

డైరెక్టర్ బీరప్పకు వినతి పత్రాన్ని సమర్పించిన నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్

లక్డీకాపూల్: నిమ్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ మంగళవారం యూనియన్ ప్రతినిధి బృందం డైరెక్టర్ డాక్టర్ బీరప్పను కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ నర్సింహులు, అధ్యక్షుడు ఎం. వెంకటేష్, మాజీ ప్రధాన కార్యదర్శి బాలయ్య, నాయకులు లక్ష్మీ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బాలయ్య మాట్లాడుతూ సెమి స్కిల్డ్ పోస్టులు భర్తీలో అన్ స్కిల్డ్‌గా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పరిగణించాలన్నారు. డెస్క్ జాబ్‌లో అర్హత కలిగిన అన్ స్కిల్డ్ కార్మికులకు అవకాశం ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. అంతే కాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించాలని కోరామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పెరిగిన వీడీఏ పాయింట్లను కూడా అమలు చేయాలని డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. దాంతో పాటు ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల రోజున విధులు నిర్వహించిన కార్మికులందరికీ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మిక శాఖ కమిషనర్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో జరిగిన ఒప్పందం ప్రకారం పదవి విరమణ చెందిన కార్మికులకు వైద్య సౌకర్యాన్ని వెంటనే అమలు చేయాలని కోరామన్నారు. కార్మికుల సమస్యల పట్ల డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు బాలయ్య పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా

ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై కార్పొరేటర్, డీసీ ఆగ్రహం

ఫిలింనగర్: అభివృద్ధి పనులను కొందరు అధికారులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని దీని వల్ల ప్రజాధనం వృథా అవుతుందని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ ప్రశాంతి అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ బస్తీలు వరదతో అతలాకుతలమయ్యాయి. బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో వరదకు రోడ్డంతా కొట్టుకుపోవడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఉప కమిషనర్ ప్రశాంతి, ఏఈ వెంకటేష్, జయచంద్రా, జలమండలి మేనేజర్ పవన్ తదితరులు మంగళవారం బస్తీల్లో పర్యటించారు. బాల్‌రెడ్డినగర్, బసవతారకనగర్ బస్తీల్లో పర్యటించి అక్కడి రోడ్ల దుస్థితిని చూసి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంజినీర్ల పనితీరుపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి మాట్లాడుతూ త్వరలోనే రోడ్డు పనులను ప్రారంభిస్తామని హామీనిచ్చారు. అంతే కాకుండా నాలాలో పేరుకుపోయిన పూడికను బుధవారం నుంచే తొలగించే పనులు మొదలు పెడతామన్నారు.

పార్కు అభివృద్ధికి సహకరిస్తా



ఎమ్మెల్యే పద్మారావుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ పార్కు అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందిస్తానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ హామీ ఇచ్చారు. కొత్తగా ఎన్నికై న చిలకలగూడ పార్కు వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పార్కులో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మర్రపల్లి రవి, శ్రీనివాస్‌గౌడ్, గురుమూర్తి, నాగేశ్వర్‌రావు, జీ.చంద్రశేఖర్, రాములు, నరసింహారెడ్డి, శ్యాంబాబు ఉన్నారు.